సాక్షి నిర్మల్

శుక్రవారం । 25 । ఆగస్టు । 2023



తనువు చాలిస్తున్నారు..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పలువురు మానసిక ఒత్తిడి, క్షణికావేశంలో ప్రాణాలు తీసుకుంటున్నారు. కుటుంబాలకు తీరని దుఃఖం మిగులుస్తున్నారు. 8లో▸



వరదొస్తే రాకపోకలు బంద్

ఖానాపూర్ మండలంలో లోలెవల్ వంతెనలు చిన్నపాటి వర్షాలకే పొంగిపొర్లుతున్నాయి. దీంతో వివిధ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
31.3 /24.4

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. రుతుపవనాలు, అల్పపీడన ప్రభావంతో చాలాచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దివ్యాంగులకు పెరిగిన పింఛన్లు



చెక్కు అందిస్తున్న డీఆర్డీవో విజయలక్ష్మి

భైంసారూరల్: దివ్యాంగులకు పెరిగిన పింఛన్లను డీఆర్డీవో విజయలక్ష్మి గురువారం అందించారు. భైంసా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త పింఛన్లను పంపిణీచేశారు. 176 మంది బీడీ టేకేదారులకు ఆసరా పథకం కింద కొత్తగా పింఛన్లు ఇచ్చారు. దివ్యాంగులకు రూ.1000 పెంచి పింఛన్లు ఇస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులకు ఇక నుంచి రూ.4,016 పింఛను లభిస్తుందన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్లను అర్హులైన వారికి అందిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో దివ్యాంగులు, బీడీ టేకేదారులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం మంత్రికి వినతి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న దివ్యాంగులు

నిర్మల్‌చైన్‌గేట్: అర్హులైన దివ్యాంగులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని స్పందన దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. గతంలో జరిగిన అవకతవకలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. అనర్హులకు ఇళ్లు ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా అధ్యక్షుడు ఇసాక్ అలీ, భగవాన్, ముత్యం, రియా జ్, గంగారం, గంగాధర్, హలీం, అంజద్ పాల్గొన్నారు.

అధికారమే లక్ష్యంగా పనిచేయాలి

- డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు



కాంగ్రెస్ పార్టీలో చేరిన యువకులు

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీలను చిత్తుగా ఓడించి కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడమే లక్ష్యంగా పనిచేయాలని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు కార్యకర్తలకు సూచించారు. మా మడ మండలం పోతారం, సోన్ మండలం జా ప్రాపూర్ గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు శ్రీహరి రావు క్యాంపు కార్యాలయంలో గురువారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కబ్జాల మంత్రి, వారాంతపు మాజీ ఎమ్మెల్యే డబ్బులతో ఓట్లు కొనాలని చూస్తున్నారన్నారు. ప్రజలు చైతన్యవంతం అయ్యారని ఈసారి ఇద్దరికీ ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు సిద్ధమయ్యారన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేసే మేనిఫెస్టోను ఇంటింటికీ తీసుకెళ్లాలన్నారు. నిర్మల్ నియోజకవర్గంలో ప్రతీ కార్యకర్త సైనికుడిలా ఈ మూడు నెలలు కష్టపడాలని సూచించారు.

'ప్రశ్నించే పార్టీ కాంగ్రెస్'

కడెం: ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుక కాంగ్రెస్ పార్టీ అని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు అన్నారు. మండలంలోని పాత కొండుకూర్ గ్రామంలో గురువారం నిర్వహించిన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు యువకులు బొజ్జు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బొజ్జు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచే కాంగ్రెస్ పార్టీని రాబోయే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లేశ్, నాయకులు వాజిద్‌ఖాన్, భూషణం తదితరులు పాల్గొన్నారు.

బలగంపై నజర్

- ప్రధాన పార్టీల్లో చేరికల పోటీ
- కారు దిగి కమలం వైపు..
- బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లోకి..
- హస్తాన్నీ అందుకుంటూ..
- మనస్తాపంతో కొందరు..
- భవిష్యత్తు కోసం మరికొందరు



నిర్మల్: ఎన్నికల వాతావరణం వేడెక్కుతోంది. ప్రధాన పార్టీల మధ్య పోటీ పెరుగుతోంది. బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ మూడు పార్టీలూ బరిలో దిగేముందు బలంతోపాటు, బలగం పెంచుకునే పనిలో పడ్డాయి. పోటాపోటీగా చేరికలను ప్రోత్సహిస్తున్నాయి. ప్రత్యర్థివర్గంలో కీలకంగా, బలంగా ఉన్న నేతలను తమవైపు తిప్పుకుంటున్నాయి. ఇక సొంతపార్టీల్లో ఇమడలేక, పక్క పార్టీల్లో చేరుతున్న నేతలూ ఉన్నారు. కొత్తవాళ్ల చేరికతో సొంతపార్టీలో ప్రాధాన్యత దక్కక మనస్తాపంతో మారుతున్న వారూ ఉన్నారు.

అటు వీడుతూ.. ఇటు చేరుతూ..

నిర్మల్ నియోజకవర్గంలో బుధవారం బీఆర్‌ఎస్, బీజేపీలో కీలక చేరికలు చోటుచేసుకున్నాయి. కారు గుర్తుపై గెలిచిన హ్యాట్రిక్ కౌన్సిలర్ అయ్యన్నగారి రాజేందర్ భారీ బలగంతో ఈటల రాజేందర్ సమక్షంలో, మహేశ్వర్‌రెడ్డి సారథ్యంలో పనిచేసేందుకు బీజేపీలో చేరారు. పట్టణంలో భారీ ర్యాలీ తీసి తన బలం చాటుకునే ప్రయత్నం చేశారు. మరోవైపు బీఆర్‌ఎస్ కూడా ఇదే ఎత్తు వేసింది. నియోజకవర్గంలో కీలకమైన సోన్ మండలం బీజేపీ అధ్యక్షుడిగా ఉన్న వ్యాక ప్రేమ్‌కుమార్‌ను పార్టీలో చేర్చుకుంది. మండలంలో బీజేపీని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించిన ప్రేమ్ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఇలా రెండు పార్టీలు ఒకే రోజు పోటాపోటీగా చేరికలను చేపట్టాయి. కాంగ్రెస్ కూడా తామేం తక్కువ కాదన్నట్లు మాజీ సర్పంచులు, ఉపసర్పంచులను డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు సమక్షంలో చేర్చుకుంది.

మనస్తాపంతో.. భవిత కోసం..

ఎన్నికల వేళ ఎన్నెన్నో రాజకీయాలు చోటు చేసుకుంటాయి. ఇందులో కొన్ని పార్టీలో అంతర్గతంగానూ జరుగుతుంటాయి. సొంత పార్టీ నేతలే పొమ్మనలేక పొగ పెడుతుంటారు. మరికొందరు ఈ పార్టీలో ఉంటే భవిత ఉండదన్న వాదనతో గోడ దూకేస్తుంటారు. ఈమధ్య జిల్లాలో జరుగుతున్న పార్టీల మార్పులో ఇలాంటివే ఎక్కువగా ఉంటున్నాయి. ప్రధానంగా బీఆర్‌ఎస్, బీజేపీల మధ్య పార్టీ మారుతున్నవారిలో ఇలాంటి నేతలే ఉంటున్నారు.

కీలకనేతలపై దృష్టి..

ప్రత్యర్థిని దెబ్బతీయాలంటే తమ బలాన్ని మాత్రమే పెంచుకుంటే సరిపోదు. ఎదుటివారి బలం తగ్గించాలన్న సిద్ధాంతాన్ని రాజకీయ పార్టీలు ఫాలో అవుతున్నాయి. ప్రత్యర్థి పార్టీల్లో ప్రధాన భూమిక పోషిస్తూ.. అభ్యర్థికి అండగా నిలిచే కీలక నేతలను తమవైపు రప్పించే ఎత్తులు వేస్తున్నారు. నిర్మల్ బీజేపీలో కీలకంగా ఉన్న మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేశ్‌చక్రవర్తిని బీఆర్‌ఎస్‌లోకి రప్పించారు. అలాగే అధికార పార్టీ నుంచి పలువురు నాయకులను తమవైపు తిప్పుకునేందుకు బీజేపీ యత్నిస్తోంది. ఈమధ్య నియోజకవర్గంలో బలమైన మున్నూరుకాపు సామాజికవర్గానికి చెందిన కొంతమంది యువ నేతలతో బీజేపీ నాయకులు మంతనాలు సాగించినట్లు ప్రచారం నడుస్తోంది.

రేఖానాయక్ ఎటువైపు..

ఖానాపూర్ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న రేఖానాయక్‌కు బీఆర్‌ఎస్ టికెట్‌ను నిరాకరించింది. ఈమేరకు ఆమె అదే పార్టీలో కొనసాగుతారా.. కాంగ్రెస్‌లో చేరుతారా.. అనే విషయంపై స్పష్టతనివ్వడం లేదు. మరోవైపు తన భర్త శ్యాంనాయక్ మాత్రం టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆసిఫాబాద్ నుంచి పోటీకి సిద్ధమవుతున్నట్లు సంకేతాలిచ్చారు. కానీ.. ఖానాపూర్ ఎమ్మెల్యే మాత్రం ఏవిషయాన్నీ తేల్చడం లేదు. తనవర్గానికి మాత్రం ఇప్పటికైతే బీఆర్‌ఎస్ వెంట ఉండాలని, తాను నిర్ణయం తీసుకున్న తర్వాత తనతో రావాలని చెప్పినట్లు తెలిసింది. ఈక్రమంలోనే టికెట్ ఖరారైన తర్వాత బుధవారం నియోజకవర్గానికి తొలిసారి వచ్చిన జాన్సన్‌నాయక్‌కు స్వాగతం పలికిన వారిలో రేఖానాయక్ వర్గం కూడా ఉండడం గమనార్హం. తాను పోటీ చేయడం ఖాయమని చెబుతున్న రేఖానాయక్ ఏ పార్టీ నుంచి అనేది మాత్రం స్పష్టత ఇవ్వడం లేదు.

పట్టణంలో కలెక్టర్ పర్యటన



బంగల్‌పేట్ డంపింగ్ యార్డులో కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ మున్సిపాలిటీ పరిధిలోని పాత అర్బన్ తహసీల్దార్ ఆఫీస్ గాంధీ పార్కు బంగల్‌పేట్ చెరువు, డంపింగ్ యార్డ్‌ను కలెక్టర్ వరుణ్‌రెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాత అర్బన్ తాహసీల్దార్ కార్యాలయం ప్రాంతంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం చేపడుతున్నందున తొందరలో చదును చేసి పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. డీఎంఎఫ్‌టీ కింద నిర్మల్ మున్సిపాలిటీకి మంజూరు చేసిన రూ.25 లక్షలతో గాంధీ పార్కులో వాకింగ్ ట్రాక్, పిల్లల ఆట వస్తువులు ఏర్పాటు చేయాలన్నారు. బంగల్‌పేట్ చెరువులో పార్కింగ్ ఏరియా, బోటింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. బంగల్‌పేట్ డంపింగ్ యార్డులో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ మిషన్లకు వారంలో ఎలక్ట్రిఫికేషన్‌చేసి పనులుప్రారంభించాలన్నారు.

కిచెన్ గార్డెనింగ్‌పై దృష్టి సారించాలి

దిలావర్‌పూర్: గ్రామీణ ప్రాంతాల్లో కిచెన్ గార్డెనింగ్‌పై దృష్టి సారించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని న్యూలోలం గ్రామంలో చేపడుతున్న కిచెన్ గార్డెన్ పనులను గురువారం పరిశీలించారు. అక్కడ స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో మొక్కలు నాటిన తీరును పరిశీలించారు. కిచెన్ గార్డెన్ ద్వారా మనకు ఇష్టమైన కూరగాయలు సాగుచేస్తూ ఆర్గానిక్ ఎరువులను వాడి పోషక విలువలతో కూడిన కూరగాయలు పండించాలని సూచించారు. ఇందులో ఎంపీడీవో మోహన్, ఎంపీవో అజీజ్‌ఖాన్, ఏపీఎం సులోచన, సీసీ ముత్యం, సర్పంచ్ ఒడ్నం సవిత, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మాకొద్దు ఈ నౌకరీ



కడెంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

- సర్దుబాటు ఉద్యోగాలపై వీఆర్‌ఏల నిరసన
- రెవెన్యూలోనే కొనసాగించాలని డిమాండ్
- త్వరలో ఆందోళన బాట

కడెం: రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ శాఖలో వీఆర్‌ఏ వ్యవస్థను రద్దు చేస్తూ వీఆర్‌ఏలను ఇరిగేషన్, మిషన్ భగీరథ, మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల్లో సర్దుబాటు చేసింది. ఈ సర్దుబాటులో భాగంగా కడెం ప్రాజెక్ట్‌కు 38 మందిని కేటాయించారు. ప్రసుత్తం 32 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అయితే తాము ప్రాజెక్ట్‌పై విధులు నిర్వహించలేమని, తమకు పేస్కేల్ ఇవ్వకున్నా సరే, జీతం పెంచి రెవెన్యూ శాఖలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు త్వరలోనే అందోళన బాట పట్టనున్నారు.

పనులు చేయలేక..

వీఆర్‌ఏలను రెవెన్యూ శాఖలో నుంచి తొలగించి ఇరిగేషన్, మిషన్ భగీరథ, మున్సిపల్, రెవెన్యూ శాఖల్లో నియమించింది. ఇందులో డిగ్రీ ఆపై చదివిన వారికి ఆయా శాఖల్లో జూనియర్ అసిస్టెంట్లుగా, మున్సిపాలిటీల్లో వార్డు ఆఫీసర్లుగా ఉద్యోగాలు ఇచ్చారు. పదో తరగతి, అంతకన్నా తక్కువ చదివిన వారిని, నిరక్షరాస్యులకు ఇరిగేషన్, మిషన్ భగీరథ మున్సిపల్‌లో ఉద్యోగాలు ఇచ్చారు. కడెం ప్రాజెక్ట్‌పై లస్కర్‌లుగా 38 మందిని నియమించారు. ఇందులో చాలా వరకు తానూర్, లోకేశ్వరం తదితర దూర ప్రాంతాలకు చెందిన వృద్ధులు ఉన్నారు. వయసు పైబడిన తమకు ప్రాజెక్ట్‌పై పనివద్దని రెవెన్యూలోనే కొనసాగించాలని అంటున్నారు. పదో తరగతి వరకు చదివిన తమను ఇరిగేషన్‌లో కేటాయించడం సరికాదని, తమకు పాఠశాలల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో కనీసం అటెండర్ పోస్టులనైనా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. పేస్కేల్ ఇవ్వకపోయినా పర్లేదని, గౌరవ వేతనం పెంచి రెవెన్యూ శాఖలోనే ఉద్యోగాలు కేటాయించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

పాత పనే మంచిగుండె



ఇన్నేళ్లు చేసిన సుంకరి పనే మంచిగుండే.. ఇప్పుడు సర్కారు నాకు డ్యాం మీద పని ఇచ్చింది. లోకేశ్వరం నుంచి వచ్చి ఇక్కడ ఇల్లు కిరాయి తీసుకుని ఉంటున్న. సార్లు మా పాత పనిలోనే ఉంచేలా సూడాలి.

– ఎల్లన్న, అడ్డిగామ, లోకేశ్వరం

కూలీ పనులు చేపిస్తుండ్రు..



ఎక్క జీతం ఇత్తమని చెప్పి వేరే నౌకరీ ఇచ్చిండ్రు. డ్యాం మీద పొరకలు సాప్ చేసే పని చేపిస్తున్నరు. రోజూ డ్యాంకు పోయి అత్తున్నం. ఈ వయసులో కష్టంగా ఉన్నది.

– ఆకుల నర్సవ్వ

అటెండర్ జాబ్ ఇవ్వాలి



ప్రభుత్వం పదో తరగతి చదివిన వీఆర్‌ఏలకు ప్రభుత్వ కా ర్యాలయాలు, విద్యా సంస్థల్లో ఆఫీస్ సబార్డినేట్, అటెండర్ పోస్టులను కేటాయించాలి. లేనిచో ఆందోళన బాట పడుతాం. – చంద్రమౌళి, పెద్దూర్


విధులు నిర్వహిస్తున్నారు



వీఆర్‌ఏల సర్దుబాటులో కడెం ప్రాజెక్ట్‌కు 38 మందిని నియమించారు. ప్రస్తుతం 32 మంది విధులు నిర్వహిస్తున్నారు. లస్కర్లు కాలువలు, ప్రాజెక్ట్ పరిసరాలను శుభ్రం చేయడం, తదితర పనులు చేయాల్సి ఉంటుంది. – భోజదాసు, డీఈ

నిరుద్యోగులకు తీపి కబురు

- రెండు రోజుల్లో డీఎస్సీ నోటిఫికేషన్
- ప్రకటించిన విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- జిల్లాలో 306 పోస్టులు ఖాళీ



నిర్మల్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు తీపి కబురు అందించింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేసేందుకు ముందుకు వచ్చింది. మరో రెండు రోజుల్లో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రకటించారు. దీంతో టెట్ పాసైన అభ్యర్థుల్లో ఆశలు చిగురించాయి.

జిల్లాలో 306 ఖాళీలు..

జిల్లాలో 735 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, వాటిలో 59 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 2,958 ఉపాధ్యాయ పోస్టులకు 2,416 మంది ప్రస్తుతం పని చేస్తున్నారు. 542 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో 236 పోస్టులు ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయనున్నారు. 306 పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేసే అవకాశం ఉంది. పదోన్నతుల ప్రక్రియ పూర్తయితే ఖాళీల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల జాబితాను ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించామని, త్వరలోనే పోస్టుల భర్తీపై క్లారిటీ వస్తుందని జిల్లా విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. డీఈవో కార్యాలయం నుంచి పంపిన ఖాళీల జాబితాలో కాస్త అటు ఇటుగా పోస్టులు మంజూరు అయ్యే అవకాశాలు ఉందని సమాచారం.

నిరుద్యోగుల్లో ఆశలు...

రెండు రోజుల్లో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని మంత్రి ప్రకటించడంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి. టీటీసీ లేదా బీఈడీతోపాటు ప్రభుత్వం నిర్వహించే టెట్ పరీక్షలో తప్పనిసరిగా ఉత్తీర్ణులై ఉండాలి. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఇప్పటి వరకు ప్రభుత్వం రెండుసార్లు టెట్ పరీక్ష నిర్వహించింది. నిరుద్యోగుల నుంచి మరోసారి ఒత్తిడి రావడంతో ఇటీవలే మరోసారి నోటిఫికేషన్ జారీ చేసింది. సెప్టెంబర్ 15న పరీక్ష నిర్వహించి అదే నెల 27న ఫలితాలు ప్రకటించనున్నారు. ఇదిలా ఉండగా, జిల్లాలో 5 వేలకు పైగా టెట్ పాసైన అభ్యర్థులు ఉన్నట్లు అంచనా. వీరితోపాటు వచ్చే నెలలో టెట్ పాసయ్యే అభ్యర్థులందరూ డీఎస్సీకి అర్హులే.

ఇవీ ఖాళీలు.......

జిల్లాలో మొత్తం 306 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు. ఇందులో ఎస్జీటీ 166 (తె/మీ), 53(ఉ/మీ), 8(మరాఠీ), 8(ఇ/మీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్ విభాగంలో ఫిజికల్‌సైన్స్ 3(తె/మీ), బయోలజికల్ సైన్స్ 10(తె/మీ), 1(ఉ/మీ), గణితం 4(తె/మీ), 1(ఉ/మీ), 1 మరాఠీ, సోషల్ 20 (తె/మీ), 2(ఉ/మీ), 1 మరాఠీ, తెలుగు 4, హిందీ 3, ఇంగ్లిష్ 1, ఉర్దూ 1, హిందీ పండిట్ 1, మరాఠీ పండిట్ 2, ఉర్దూ పండిట్ 1 పీఈటీ 4, ఆర్ట్ అండ్ డ్రాయింగ్ 4(తె/మీ), 2(ఉ/మీ), మ్యూజిక్ టీచర్ 2, ఒకేషనల్ 5 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అయితే వీటిలో ఎన్ని పోస్టులు మంజూరు చేస్తారో ప్రభుత్వం చేతిలో ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

కనీస వేతనం కోసం ఆశ వర్కర్ల నిరసన



అంబేడ్కర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆశ వర్కర్లు

భైంసారూరల్: ప్రభుత్వం ఆశ వర్కర్లకు కనీసవేతనం అమలు చేయాలని భైంసా పట్టణంలో గురువారం నిరసన తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ఆశ వర్కర్లు భైంసా పట్టణానికి చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం పారితోషికం ఇవ్వకుండా ఆశ వర్కర్లతో అదనపు పనులు చేయించుకుంటుందన్నారు. అత్యవసర సమయాల్లో వెళ్లలేని పరిస్థితులు ఎదుర్కొంటున్నామన్నారు. తమపై పనిభారం తగ్గించాలన్నారు. కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని, పెండింగ్ బకాయిలు, ప్రసూతి సెలవుల సర్క్యులర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహానికి అందించారు. నిరసనలో విజయ, గంగమణి, మౌనికతోపాటు నియోజవర్గంలోని ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో ర్యాలీ

ఖానాపూర్: చాలీచాలని వేతనంతో పనిచేస్తున్న ఆశ కార్యకర్తలకు ప్రభుత్వం కనీసవేతనం రూ.18 వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు పి.గంగమణి కోరారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతిభవనం నుంచి ప్రధాన రహదారి వెంట ర్యాలీ నిర్వహించారు. నిరసనలో భాగంగా ఈనెల 26న తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా, 29న ఎమ్మెల్యే ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తామన్నారు. కార్యక్రమంలో వినోద, రజిత, మమత, జ్యోతి, సుజాత, ఆశాలత, గంగరాజు తదితరులు ఉన్నారు.

భైంసా డిపోను తనిఖీ చేసిన డీఆర్‌ఎం



ఆర్టీసీ సిబ్బందితో మాట్లాడుతున్న ప్రణీత్

భైంసా: భైంసా ఆర్టీసీ డిపోను ఉమ్మడి ఆదిలాబాద్ రీజియన్ డిప్యూటీ మేనేజర్ ప్రణీత్ గురువారం తనిఖీ చేశారు. డిపో మేనేజర్ అమృతతో కలిసి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షంతో డిపో నీటమునిగి జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బస్టాండ్ చేరుకుని ఉద్యోగులతో మాట్లాడారు. ఆర్టీసీకి మూలాధారం ప్రయాణికులే అన్నారు. రాయితీ పాసులు, టీ9, టీ30 టికెట్లపై వివరిస్తూ ప్రయాణికులను ఆకర్షించాలని సూచించారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- ఖానాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్‌నాయక్



కార్యకర్తలకు అభివాదం చేస్తున్న జాన్సన్‌నాయక్

ఖానాపూర్/ఇంద్రవెల్లి: రానున్న ఎన్నికలలో బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించే దిశగా కార్యకర్తలంతా పనిచేయాలని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్‌నాయక్ అన్నారు. ప్రజాప్రతినిధులు, మండల కార్యకర్తలతో గురువారం సమావేశమయ్యారు. ముందుగా జాన్సన్‌నాయక్‌కు మండల ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను రాజకీయం చేయడానికి రాలేదని, ఖానాపూర్ ప్రజల సేవ చేయడానికి వచ్చానని అన్నారు. ఎన్నికల్లో ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి భారీ మెజార్టీతో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పోటే శోభాబాయి, పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, సర్పంచ్ కోరెంగా గాంధారి, ఎంపీటీసీలు కోవ రాజేశ్వర్, ఆశబాయి, నాయకులు కనక తుకారాం, కనక హనుమంతరావు, మెస్రం తుకారాం, సుఫియాన్, సాయినాథ్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులందరికీ ప్రాధాన్యం

ఉద్యమకారులందరికీ సరైన ప్రాధాన్యత కల్పిస్తానని జాన్సన్‌నాయక్ అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ పూర్వ ఉద్యమకారులు పట్టణంలో ఏర్పాటుచేసిన ఆత్మీయసమ్మేళనానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తన గెలుపునకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ డెయిరీ కార్పొరేషన్ చైర్మన్ లోక భూమారెడ్డి, నాయకులు కిశోర్, సురేశ్, శంకర్, శ్రీనివాస్, సంతోష్, గంగాధర్, మహేష్, రాజేందర్‌గౌడ్, వెంకటప్పయ్య, లక్ష్మణ్, రాజేశ్వర్, రాములు, సత్యం, మధు, శ్రీధర్‌గౌడ్, ప్రవీణ్, రాజన్న, శంకర్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కనుసన్నల్లో 'ఇథనాల్'

- ఫ్యాక్టరీ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు
- అన్నీ తెలిసే ఐకేరెడ్డి నాటకాలాడుతున్నారు
- బీజేపీ నాయకుల ఆరోపణ



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: దిలావర్‌పూర్–గుండంపల్లి మధ్య ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణ ప్రక్రియ పూర్తిగా మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కనుసన్నల్లోనే జరుగుతుందని, రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు అనుమతి ఇచ్చిందని బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, సత్యం చంద్రకాంత్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని మహేశ్వర్ రెడ్డి నివాసంలో గురువారం మాట్లాడారు. ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు సంబంధించి తమవద్ద ఒక్క పత్రం కూడా లేదని మంత్రి పేర్కొనడం సిగ్గుచేటన్నారు. ఇందుకు సంబంధించిన అన్ని అనుమతులను రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎక్సైజ్, ఇరిగేషన్, పరిశ్రమలు తదితర శాఖలవారీగా ఉన్నాయని వివరించారు. దిలావర్‌పూర్ మండలంలో బీజేపీ బలంగా ఉందన్న అక్కసుతో లేనిపోని అబద్ధాలను మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అవినీతిలో కూరుకుపోయిన మంత్రి తాను నిర్వహిస్తున్న మంత్రిత్వ శాఖలపైనా అవగాహన లేకపోవడం హాస్యాస్పదమన్నారు. రైతుల వద్ద యాజమాన్యం భూములను కొనుగోలు చేస్తే, దాంట్లో బీజేపీ నాయకుల హస్తం ఉందని మంత్రి చెప్పడం సరికాదన్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీల ఏర్పాటును మంత్రి కేటీఆర్ ప్రోత్సహిస్తుండటం, అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ ఫ్యాక్టరీల ఏర్పాటుకు సహకరించాలని జీవో జారీ చేయడం మంత్రికి తెలియదా అని ప్రశ్నించారు. గతంలో షుగర్ ఫ్యాక్టరీ నిర్మిస్తామని మంత్రి, ఆయన కుటుంబసభ్యులు అసైన్డ్ భూములను సైతం రైతుల వద్ద తక్కువ ధరకు సేకరించారని గుర్తు చేశారు. భూములిచ్చిన రైతుల కుటుంబాలకు అదే ఫ్యాక్టరీలో ఉద్యోగాలు కల్పిస్తామని మోసం చేశారని ఆరోపించారు. షుగర్ ఫ్యాక్టరీ కోసం సేకరించిన భూములను తిరిగి ఆ రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ నాయకులు ముత్యంరెడ్డి, తక్కల రమణరెడ్డి, వీరేశ్, హరీశ్‌రెడ్డి, సాగర్, సరికెల గంగన్న, నర్సారెడ్డి, నారాయణ్‌గౌడ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ వీఆర్‌ఏలకు అన్యాయం

ఖానాపూర్: వీఆర్‌ఏ వ్యవస్థను రద్దు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో సీనియర్ వీఆర్‌ఏలకు తీరని అన్యాయం జరిగిందని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సునారికారి రాజేశ్ అన్నారు. పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ విధానాలతో వీఆర్‌ఏల ఉద్యోగభద్రత లేకుండా పోయిందన్నారు. భద్రతలేని శాఖల్లో కేటాయించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. వీఆర్‌ఏల నుంచి ఎలాంటి అభిప్రాయాన్ని సేకరించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందన్నారు. వీఆర్‌ఏల ర్యాండమైజేషన్‌తో సీనియర్ వీఆర్‌ఏలకు అన్యాయం జరిగిందన్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. లేకుంటే వీఆర్‌ఏలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భూక్య విలాస్, నాయకులు నర్సయ్య, రాజన్న, భీమరాజు, రాజమౌళి, భూమన్న, సత్తవ్వ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'నవోదయ' దరఖాస్తులకు నేడే ఆఖరు

• 26, 27 తేదీల్లో సవరణలకు అవకాశం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని త్రిశూల్ పహాడ్‌పై గల కేంద్రీయ జవహర్ నవోదయ విద్యాలయంలో 2024- 25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు ఈ నెల 25తో ముగియనుందని ప్రిన్సిపాల్ చక్రపాణి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం తర్వాత మరోసారి గడువు పొడిగింపు ఉండదని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. కులం, పరీక్ష రాసే భాష, పట్టణ/గ్రామీణం తప్పుగా నమోదు చేసుకుంటే ఈ నెల 26, 27 తేదీల్లో ఆన్‌లైన్‌లో సవరణలకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో ప్రభుత్వ/ప్రైవేట్ పాఠశాల్లో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఇంటికి చేరుకున్న షోయబ్



షోయబ్‌ను తండ్రికి అప్పగిస్తున్న పోలీసులు

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామానికి చెందిన శేక్ షోయబ్(22) ఈనెల 15వ తేదీన అత్తగారింటి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతడి తల్లిదండ్రులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. అయితే షోయబ్ గురువారం తనంతటా తానే తిరిగి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాడు. దీంతో ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి విచారించగా తన భార్య, బావమరుదుల వేధింపులు తట్టుకోలేకనే ఇంట్లో నుంచి వెళ్లిపోయినట్లు పోలీసులకు తెలిపాడు. దీంతో పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నిందితుడికి రెండున్నరేళ్ల జైలు

• రూ.3,500 జరిమానా

ఆదిలాబాద్‌టౌన్: ఎస్సీ, ఎస్టీ కేసులో నిందితుడికి రెండున్నరేళ్ల జైలు శిక్షతో పాటు రూ.3,500 జరిమానా విధిస్తూ ఎస్సీ, ఎస్టీ స్పెషల్ కోర్టు అదనపు జడ్జి శివరాంప్రసాద్ గురువారం తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి సయ్యద్ తాజొద్దీన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌కు చెందిన ఓ మహిళను ఆమె ఇంటి ఎదుట ఉన్న నరేష్ అనే వ్యక్తి కొన్ని రోజులుగా దూషిస్తున్నాడు. అసభ్యకర పదజాలంతో పాటు కులం పేరుతో దుర్భాషలాడాడు. దీంతో బాధితురాలు 2017 ఆగస్టు 17న మందమర్రి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్‌హెచ్‌ఓ సత్తయ్య కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. చార్జిషీట్ దాఖలు చేశారు. ఆదిలాబాద్ ఎస్సీ, ఎస్టీ కోర్టు విచారణ చేపట్టగా నేరం రుజువు కావడంతో ఈ మేరకు పైవిధంగా శిక్ష విధిస్తూ జడ్జి తీర్పునిచ్చినట్లు వివరించారు.

తనువు చాలిస్తున్నారు..

• ఒత్తిడితోనే అర్ధంతరంగా జీవితం ముగింపు

''అతడో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఉన్నత ఉద్యోగం, చక్కని కుటుంబం అన్ని రకాల సౌకర్యాలతో కూడిన జీవితం.. అయినా ఏదో ఒత్తిడి, విధి నిర్వహణలో పనిభారం పెరిగిందని తన లోతానే మదనపడ్డాడు. భార్యతో పంచుకున్న ఆ బాధకు పరిష్కారం లభించలేదు. గుండెలోని తన ఆవేదనను మిత్రులతో చెప్పలేక తన మనసులో తానే బాధపడుతూ చివరకు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన రెండు రోజుల క్రితం చోటుచేసుకుంది. ఇలాంటి సంఘటనలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అనేకం.''

'' అది నిర్మల్ జిల్లాలోని బాసర ఆర్జీయూకేటీ... పదో తరగతి అప్పుడే పూర్తి చేసుకొని కాలేజీలోకి కొంగొత్తగా వచ్చిన విద్యార్థులు కొత్తదనాన్ని అలవాటు పడటానికి సమయం పడుతుంది. మరికొందరేమో ఇతరత్రా కుటుంబ సమస్యలు, వ్యక్తిగత కారణాలు.. ఈ సందర్భంలోనే ఒత్తిడికి గురై భారం భరించలేక బలవన్మరణాలకు పాలపడిన విద్యార్థుల ఘటనలు గత నాలుగు నెలల కాలంలో అనేకమందిని దిగ్భ్రాంతిని కలిగించాయి. ఇవికాకుండా ప్రతీ రెండు మూడు రోజులకొకరు ఆత్మహత్యలకు పాలపడుతున్న ఘటనలు అనేకం.''



పై రెండు ఘటనల్లోనూ మనసులోని బాధను పంచుకునేవారు లేకపోవడం.. అలాంటి వారిని గుర్తించి సరైన కౌన్సెలింగ్ ఇవ్వకపోవడంతోనే ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. మానసిక వేదనకు గురైన వారు ఇతరులతో మాట్లాడితే వారి జీవితం మారే అవకాశం లేకపోలేదు. – నిర్మల్‌ఖిల్లా

జీవితం ముగిస్తున్నారు..



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పలువురు చదువుల్లో రాణించడం లేదని, ప్రేమ విఫలమైందని, అప్పుల బాధలు ఎక్కువయ్యాయని, వివాహేతర సంబంధాలు, ఉద్యోగ విధి నిర్వహణలో ఒత్తిడి, సంబంధమేలేని కారణాలతో క్షణికావేశంలో తమ ప్రాణాలు తీసుకుంటున్నారు. ఇటీవల కాలంలో తమ ప్రేమకి పెద్దలు అంగీకరించడం లేదనే బాధతో ఇద్దరు టీనేజర్లు రైలు పట్టాలపై తల పెట్టి ప్రాణాలు తీసుకున్నారు. మరో సంఘటనలో తనతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న వ్యక్తి వేధింపులకు గురిచేస్తున్నాడని ఓ మహిళ అతడిని గొంతుకోసి హతమార్చింది. వ్యవసాయానికి చేసిన అప్పులు తీర్చలేక రైతులు ఆత్మహత్యల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక ఉదాహరణలున్నాయి.

• అన్నివర్గాల వారూ ప్రభావితం...
• ఉమ్మడి జిల్లాలో ఆత్మహత్యల ఉదంతాలెన్నో.
• ధ్యానం, యోగా, దృఢచిత్తం కీలకమంటున్న నిపుణులు

ఒత్తిడిలో ఉన్నవారికి సాంత్వన అవసరం



ఒత్తిడిలో ఉన్నది విద్యార్థి అయినా, యువకుడైనా, పెద్దవాళ్లైనా ఆ ఒత్తిడికి తగిన సాంత్వన చేకూర్చే ఉపశమనం కలిగించే మాటలు అత్యంత అవసరం. ఆ ఒత్తిడిని అధిగమించేలా సరైన పద్ధతులతో కౌన్సెలింగ్‌ను చేపట్టడం, జీవితం విలువను తెలియపరచడం వంటివి చేయాలి. వారి సమస్యలను సావధానంగా విని పరిష్కార మార్గాలను సూచించే ప్రయత్నం చేయాలి. సమస్యను భూతద్దంలో చూడకూడదని సమస్యలు లేని వ్యక్తులు ఎవరు ఉండరని వారికి వివరంగా తెలియజెప్పాలి.

– అడ్డిగ శ్రీనివాస్, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్

యోగా, ధ్యానంతో మరింత ప్రయోజనం...



ప్రతీరోజు క్రమం తప్పకుండా యోగా, ధ్యానం వంటివి చేయడంతో మనిషికి సమస్యలను తట్టుకోగలిగే స్థిరత్వం చేకూరుతాయి. మానసికంగా శారీరకంగా దృఢంగా తయారవుతారు. ధ్యానంతో ఏకాగ్రత పెరిగి మానసిక సమతుల్యత ఏర్పడుతుంది. దీంతో భిన్నమైన ఆలోచనలు కలిగి సమస్యలను అధిగమించే శక్తి లభిస్తుంది..

– బాలాజీ యాదవ్, యోగా నిపుణులు, నిర్మల్

ఇలాంటివారే స్ఫూర్తి...



చిన్నప్పుడు పదో తరగతి వరకు చదివే స్తోమత కూడా లేకుండేది. ఎలా బతకాలో తెలియని పరిస్థితి, దిగువ మధ్యతరగతి కుటుంబం. అయినా పదో తరగతి తరువాత మెకానిక్ షెడ్డులో చేరి క్రమం తప్పకుండా మెకానిక్ నైపుణ్యాన్ని అలవర్చుకున్నాను. డబ్బులు పోగు చేసుకుని సొంతంగా బైక్ మెకానిక్ షాప్ పెట్టాను. ప్రస్తుతం సొంత ఇల్లు కట్టుకొని, పిల్లల్ని చదివించుకుంటూ హాయిగా ఉన్నాను. మరో నలుగురికి ఉపాధి కల్పిస్తున్నాను. చదువే జీవితం కాదు.

– మార్గం శ్రీను, బైక్ మెకానిక్

నిర్మల్ మెడికల్ కాలేజీలో స్టేట్ కోటా అడ్మిషన్

• 58 మందికి ప్రవేశాలు
• తొలిరోజు ఐదుగురు చేరిక



విద్యార్థికి అడ్మిషన్ అందిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ జెవిడిఎస్ ప్రసాద్

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ మెడికల్ కళాశాలలో స్టేట్ కోట కింద సీట్లు పొందిన అభ్యర్థులు గురువారం అడ్మిషన్స్ తీసుకున్నారు. ఇప్పటి కే ఆల్ ఇండియా కోటాలో ఐదుగురు అడ్మిష న్ తీసుకోగా రాష్ట్ర కోటాలో మొదటి రోజు గు రువారం ఐదుగురు విద్యార్థులు నూతనంగా అడ్మిషన్స్ తీసుకున్నారు. నిర్మల్ మెడికల్ క ళాశాలకు 58 మంది విద్యార్థులకు తొలి విడతలో అడ్మిషన్లు దక్కాయి. ఈనెల 25,26 తే దీల్లో మిగిలిన విద్యార్థులు అడ్మిషన్లు పొందేందుకు అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

హత్య కేసులో ఐదుగురికి జీవిత ఖైదు

ఆసిఫాబాద్: హత్య కేసులో ఐదుగురు వ్యక్తులకు జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.15 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ గురువారం తీర్పు చెప్పినట్లు కౌటాల సీఐ సాదిక్ పాషా, బెజ్జూర్ ఎస్సై విక్రమ్ తెలిపారు. 2009 సెప్టెంబర్ 28న బెజ్జూర్ మండలం రుద్రాపూర్‌కు చెందిన గుర్లే పెంటు (52) హత్యకు గురయ్యాడు. మృతుని భార్య ఫిర్యాదుతో ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. వీరిలో గుర్లె ఇస్తారి, టాక్రె పోచయ్య మృతి చెందగా మిగిలిన ఆరుగురిలో వసాకె సంతోశ్, గుర్లే సాయినాథ్, గుర్లే లక్ష్మి, వసాకె బీంబాయి, టాక్రె తానక్కలను పోలీసులు కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేయించడంతో వారికి శిక్ష పడింది.

వైన్స్‌షాప్‌లో దొంగతనం



వైన్స్‌షాపులో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఉట్నూర్‌రూరల్: మండంలోని లింగోజీతండా ఎక్స్‌రోడ్డుని శ్రీనివాస్, ఛత్రు వైన్స్, పాన్‌షాపుల్లో బుధవారం రాత్రి దొంగలు పడ్డారు. విషయం తెలుసుకున్న సీఐ ప్రేమ్‌కుమార్‌తో కలిసి ఎస్సై మనోహర్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వైన్స్ షాపులో రెండు మందుబాటిళ్లు, సుమారు రూ.6వేలు దొంగిలించినట్లు గుర్తించారు. సీసీ టీవీ ఆధారంగా నిందితుడిని పట్టుకుంటామని చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దక్కిన ప్రాణాలు

• పాముకాటుకు గురైన వ్యక్తి.. సకాలంలో స్పందించిన 108 సిబ్బంది



భీంరావ్‌ను 108లో రిమ్స్‌కు తరలిస్తున్న సిబ్బంది

బజార్‌హత్నూర్: మండలంలోని చింతలసాంగ్వి గ్రామానికి చెందిన ఉయికే భీంరావ్ గురువారం వేకువజామున ఇంట్లో నేలపై పడుకొని ఉండగా కట్లపాము కాటు వే సింది. నొప్పిగా ఉండటంతో కుటుంబ స భ్యులను నిద్రలేపా డు. వారు లైట్ వేసి చూసే సరికి పక్కనే పాము కనిపించింది. వెంటనే పామును చంపి భీంరావ్‌ను 108 అంబులెన్స్‌లో బజార్‌హత్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని మెడికల్ ఆఫీసర్ భీంరావ్ తెలిపారు. ఈఎంటీ పాట రాజు, పైలట్ నాందేవ్‌లను భీంరావు కుటుంబీకులు అభినందనలు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



రమేష్(ఫైల్)

లక్ష్మణచాంద: ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని రాచాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... మండలంలోని రాచాపూర్ గ్రామానికి చెందిన కాసాని రమేష్(22) ఆర్థిక ఇబ్బందులతో గురువారం గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాలపడ్డాడు. ఉదయం ఇంటి నుంచి వెళ్లిన రమేష్ సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో చేనుకు వెళ్లి చూడగా అక్కడ చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. మృతుడికి భార్య, ఏడాది కుమారుడున్నాడు.

ఆటోడ్రైవర్..



మధుకర్ (ఫైల్)

ఉట్నూర్‌రూరల్: పురుగుల మందుతాగి ఆటో డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... మండలంలోని నాగాపూర్‌కు చెందిన సుంకరి లచ్చన్న శంకరమ్మ దంపతులు కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ఇద్దరు సంతానం కూతురికి వివాహం కాగా కొడుకు మధుకర్ (23) ఆటో నడుపుకుంటూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం ఉట్నూర్ మండల కేంద్రం కేబీ ప్రాంగణం సమీపంలో పురుగుల మందు తాగి పడిపోయాడు. ఈ విషయాన్ని తోటి మిత్రుడికి ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. దీంతో అతను అక్కడికి చేరుకొని మధుకర్‌ను ద్విచక్ర వాహనం ద్వారా ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు తెలియరాలేదు.. ఈ విషయమై ఉట్నూర్ ఎస్సై మనోహర్‌ను వివరణ కోరగా.. యువకుడు ఆత్మహత్య చేసుకున్న విషయం విధితమేనని, తమకు కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడు..

నార్నూర్: గాదిగూడ మండలంలోని ఖాండోరాంపూర్ గ్రామానికి చెందిన అజాపతి (17) గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై మహేష్ వివరాల ప్రకారం.. ఖాండోరాంపూర్ గ్రామానికి చెందిన ఆనందరావుకు ముగ్గురు సంతానం. అజాపతి చిన్న కుమారుడు. చదువుకోకపోవడంతో పాటు పని చేయకుండా తిరగడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లోని పురుగుల మందుతాగాడు. గమనించిన కుటుంబీకులు వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

బెడ్ పద్ధతిలో సోయా సాగు..!



ఈ ఫొటోలోని రైతు పేరు యోగిరాజ్ పటేల్. మహారాష్ట్రకు చెందిన ఈయన కుంటాల మండలానికి వలస వచ్చాడు. ఏళ్లుగా స్థానిక రైతుల భూములు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. సంప్రదాయ పద్ధతిలో సాగుతో ఆదాయం అంతంత మాత్రంగానే ఉంది. దీంతో గతేడాది వ్యవసాయాధికారుల సూచనతో కొత్త తరహాలో సోయా సాగు చేశాడు. బెడ్ పద్ధతిలో సోయా విత్తడంతో ఖర్చు తగ్గడంతోపాటు దిగుబడి పెరిగింది. సాధారణ దిగుబడి కంటే నాలుగైదు క్వింటాళ్లు ఎక్కువ దిగుబడి సాధించాడు. దీంతో ఈ ఏడాది కూడా 46 ఎకరాల్లో అదే విధానంలో సోయా విత్తాడు. పంట ఆశాజనకంగా ఉంది. మండలంలో చాలా మంది రైతులు ఈఏడాది యోగిరాజ్ బాటలోనే పయనిస్తున్నారు.

• రెట్టింపు దిగుబడులు
• మక్కువ చూపుతున్న రైతులు

కుంటాల: సాగు విధానంలో రైతులు నూతన పద్ధతులను అవలంబిస్తున్నారు. పెట్టుబడులు పెట్టి ఆర్థికంగా నష్టపోతున్న తరుణంలో దిగుబడులు రాక ఇబ్బందులు పడుతున్నారు. తక్కువ పెట్టుబడులతో అధిక లాభాలు సాధించాలని గత ఏడాది మండల వ్యాప్తంగా 200 ఎకరాల్లో బెడ్ విధానం సాగుకు రైతులు శ్రీకారం చుట్టగా రెట్టింపు దిగుబడులు రావడంతో ఈ ఖరీఫ్ సీజన్లో 500 ఎకరాల్లో సాగు చేసేందుకు ముందుకు వచ్చారు. మహారాష్ట్రలోని ధర్మాబాద్ మండలంలోని సంరాల గ్రామానికి చెందిన రైతు గత రెండేళ్లుగా కుంటాల మండలం అందాకూర్, పెంచికల్ పాడ్, విట్టాపూర్ గ్రామాలలో భూములు కౌలుకు తీసుకొని సోయా సాగు విధానంలో కొత్త పద్ధతులు పాటించడంతో రెట్టింపు దిగుబడులు రావడంతో ఆయనను ఆదర్శంగా తీసుకుంటున్నారు.



పెంచికల్‌పాడ్ లో ఏపుగా పెరిగిన సోయా



కలెక్టర్‌కు సాగు విధానం వివరిస్తున్న రైతులు

లాభాలు రెట్టింపు..

మండలంలోని ఆయా గ్రామాల్లోని రైతులు ఈ యేడు 5వేల400 ఎకరాల్లో సోయా పంట సాగుకు శ్రీకారం చుట్టారు. 500 ఎకరాల్లో బెడ్ విధానం ద్వారా సాగుచేయగా, కల్లూర్ క్లస్టర్ పరిధిలో 200 ఎకరాల్లో సాగు చేయడం విశేషం. బెడ్ విధానం సాగు చేసే రైతులు మొదటగా భూమి చదును చేస్తారు. తర్వాత హ్యాండ్ సీడర్ ద్వారా విత్తనాలను విత్తుతారు. ఎకరానికి మూడు బ్యాగుల సింగల్ సూపర్ ఫాస్ఫేట్ విత్తనం వేయకంటే ముందే చదును చేసిన భూమిలో వెదజల్లుతారు. ట్రాక్టర్ ద్వారా బెడ్లను తయారు చేస్తారు. విత్తనం విత్తగానే 72 గంటల లోపు కలుపు మొక్కల నివారణకు మందును పిచికారీ చేస్తారు. సాధారణ పద్ధతిలో ఎకరానికి రెండు బస్తాలు విత్తనాలు విత్తితే రూ.7వేలు ఖర్చు కాగా ఈ విధానం ద్వారా15 కిలోల విత్తనాలు మాత్రమే అవసరమవుతాయి. 25 శాతం విత్తనాలు మాత్రమే అవసరమై75 శాతం విత్తనాలు ఆదా అవ్వడమే కాకుండా కేవలం రూ.వేయి మాత్రమే ఖర్చు అవుతుంది. 3.5 ఫీట్ల బెడ్ పైన రెండు వరుసలు ఉండేలా విత్తనాలు విత్తుతారు. ఎకరాకు 25 వేల రన్నింగ్ ఫీట్ కాగా 80 వేల మొక్కలు ఎదుగుతాయి. ఈ లెక్కన ఒక మొక్కకు 25 గ్రాముల దిగుబడి అంచనా వేసుకున్నా 20 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా15 క్వింటాళ్ల దిగుబడి తప్పనిసరిగా వస్తుంది. అలాగే కలుపు మొక్కలు, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి వస్తుంది.

రైతులను అభినందించిన కలెక్టర్....

మండలంలోని ఆయా గ్రామాల్లో బెడ్ విధానం పై రైతులు సోయా పంట సాగు చేస్తున్నారు. ఇటీవల కుంటాల మండలానికి పర్యటన వచ్చిన సందర్భంగా జిల్లా కలెక్టర్ వరుణ్ రెడ్డి అందాకూర్ శివారులో పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సాగు చేస్తున్న విధానం రైతులు కలెక్టర్ కు వివరించడంతో అభినందించారు. నూతన విధానాలతో రైతులను ప్రోత్సహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

పెట్టుబడులు అధికం



సాధారణ పద్ధతిలో సోయా సాగు చేస్తే ఎకరానికి 8 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తుంది. బెడ్ పద్ధతి విధానం ద్వారా సాగు చేయడంతో కలుపు మొక్కల బెడద ఉండదు. కూలీల అవసరం కూడా తక్కువే. అధిక దిగుబడులు వస్తున్నాయి.

సాయి, రైతు, అందాకూర్

అవగాహన కల్పిస్తున్నాం...



మండలంలోని రైతులు సోయా సాగులో ఆధునిక పద్ధతులు పాటిస్తున్నారు. ఎకరానికి15నుంచి 20 క్వింటాళ్ల దిగుబడులు వస్తున్నాయి. సోయా సాగు చేస్తున్న రైతులను ఇటీవల కలెక్టర్ అభినందించడం గర్వంగా ఉంది.

– గణేష్ ,ఏఈవో, కల్లూర్

రిమ్స్‌లో ఒకరి మృతి

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రకు చెందిన ఉయికె సంగీత పాముకాటుకు గురై జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో గురువారం మృతి చెందినట్లు టూటౌన్ ఏఎస్సై ముకుంద్‌రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా భోకర్‌వాడికి చెందిన సంగీత బుధవారం పంట చేనులో కలుపు తీసేందుకు వెళ్లగా సాయంత్రం 5గంటల ప్రాంతంలో పాముకాటుకు గురైంది. దీంతో కుటుంబీకులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందింది. మృతుడి భర్త పుండలిక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

మృతదేహం స్వాధీనం

జైనథ్: మండల కేంద్రంలోని వైన్స్ ఎదురుగా పొదల్లో లభించిన మృతదేహం కలకలం రేపింది. అటుగా వెళ్తున్న స్థానికులు, గురువారం సాయంత్రం వైన్స్ వద్ద కుళ్లిన వాసన వస్తుండటంతో చుట్టుపక్కల పరిసరాలు గాలించారు. కాగా పొదల్లో మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు శవాన్ని పరిశీలించి జైనథ్ మండలం దీపాయిగూడ గ్రామానికి చెందిన క్యాతం గంగారెడ్డి (55)దిగా గుర్తించారు. మృతుడి కుటుంబీకులకు సమాచారం అందించారు. అయితే ఈ నెల 21న ఇంటి నుంచి బయటకు వెళ్లిన గంగారెడ్డి ఇంటికి రాకపోగా శవమై కనిపించాడు. మృతుడి కుమారుడు క్యాతం రవి కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కి తరలించారు.